# 36. డస్ట్ బిన్‌లో కళ

ఆర్ట్ ఎగ్జిబిషన్ నుండి బయటపడి ఓ అరకప్పు స్ట్రాంగ్ టీ సేవించాక మా విలేఖర మిత్రుడు కాస్త కోలుకున్నాడు. పిచ్చాస్పత్రినుండి తప్పించుకు రాగలిగిన బుద్ధిమంతుడిలా ఊపిరి పీల్చుకున్నాడు.

నేనూ సంతోషించేను. ఈయన గారికి ఆర్ట్ ఎగ్జిబిషన్లో ఉండగా ఏ ప్రమాదమేనా జరిగితే ఎంత అప్రతిష్ఠ. ఎంతయినా నేనూ స్వయంగా ఓ ఆర్టిస్టునే గదా! 'కళాఖండాలు చూసి మూర్ఛిల్లిన- లేదా- పిచ్చెక్కిన పత్రికా విలేఖరి విషాదగాధ' అని రేపు పత్రికల్లో అచ్చయితే మా చిత్రకళారంగానికీ, కళాకారులకూ, వారి కళకు పరువేమన్నా నిలుస్తుందా!

"ఎలా ఉంది విలేఖర కామ్రేడ్? ఆధునిక కళ చాలా ఘాటుగా ఉందనుకుంటాను!' అని పరామర్శించేను.

అవునన్నట్లతను తలూపేడు, కాస్సేపాగి అడిగేడు. 'కానీ, సార్! మీరు ఆర్ట్ క్రిటిక్కు గదా! ఈ బాపతు ఎగ్జిబిషన్లనూ, కళాఖండాల్ని ఎన్నింటినో చూసి ఉంటారు. మరి మీరింత ఆరోగ్యంగా వుండగలగటం ఆశ్చర్యంగావుందిస్మండీ! అన్నాడతను, నన్నో మహా పురుషుడిని చూసినట్టు చూస్తూ.

అతనికో కథ చెప్పేను వెనకటికో పెద్దమనిషి బ్లాక్ మనీ ఎక్కువయిపోయి తెలిసిన వారెవరో వారి పెయింటింగుల ఎగ్జిబిషన్ పెట్టి పిలిస్తే వెళ్ళి ఓ కళాఖండం కొనేసి వాళ్ళ మేనేజరుకిచ్చి పంపేశాట్ట. ఆ నేమేజరు సూపరింటెండెంటు కివ్వగా, అతను దాన్ని ఆఫీసులో ప్రొప్రయిటరుగారి రూంలో శ్రీవారి కుర్చీ కెదురుగా గోడకు వేలాడదీశాట్ట.

ఆ మర్నాడు ప్రొప్రయిటరుగారు ఆఫీసుకు రాగానే, కుర్చీలో కూర్చోగానే ఎదురుగా ఉన్న సదరు బొమ్మనుచూసి ఉలిక్కిపడి లేచి మేనేజర్ని పిలిచి కేకలు వేశాట్ట. "ఇదేమిటయ్యా! దీన్నిక్కడ ఎందుకు వ్రేలాడదీశావూ!" అని.

అందుకు ఆ మేనేజరు వినయంగా 'మరేం వ్రేలాడదీయమన్నారు సార్! ఆర్టిస్టుగారు దొరికి చావందే!' అన్నాట్ట.

అందుమీదట ప్రొప్రయిటర్ సాబ్ దాన్నక్కడ్నుంచి తీసేయించి ఆఫీసు మెయిన్‌హాల్లో వ్రేలాడ దీయించాట్ట. ఖరీదు వెయ్యిన్నూటపదహార్లు అని రాసి ఉన్న లేబిల్ కావాలనే ప్రముఖంగా కనపడేలా ఉండనిచ్చాట్ట.

ఆ మర్నాటి నుండీ ఆ ఆఫీసులోని ఉద్యోగులంతా సదరు పెయింటింగులోని కళను ఆస్వాదించటంలో పోటాపోటీలు పడసాగారట. వారిలో ఓ అజ్ఞాని మాత్రం 'అసలు ఈ బొమ్మలోవున్న బొమ్మ ఏంటీ?' అని ఓ పెద్దప్రశ్న లేవదీశాట్ట. అందుమీదట ఆఫీసులో ఆ విషయంమీద నాలుగు గ్రూపులు ఏర్పడాయట. ఒకరు 'ఈ పెయింటింగులో ప్రముఖంగా కను

పిస్తున్నది. అదుగో ఆ ఎర్రరంగులో ఉన్న భాగం. ఎరుపు సూర్యోదయానికి చిహ్నం. మనమంతా తెల్లారగట్లే ఆఫీసు కొచ్చి కూర్చుని బుద్ధిగా పనిచేయాలని ఈ కళాఖండం ప్రబోధిస్తున్నది!' అని తీర్మానించారట!

రెండో గ్రూపువారు 'కాదు! ఆ ఎరుపు సూర్యాస్తమయానికి సింబల్! ప్రొద్దుగూకకుండానే కొంపలకు చేరి భోంచేసి నిద్రబోవటం మనఆరోగ్యాలకు మంచిదని ఈపెయింటింగ్ సారాంశం!' అని తీర్మానించారట.

మూడో గ్రూపువారు 'కాదు! ఎరుపు విప్లవానికి సంకేతం, మనమంతా జీవితాన్ని విప్లవాత్మకం చేసుకోవాలని ఈ మహత్తర కళాఖండం నిర్దేశిస్తున్నది, అయితే మనం కేవలం వేతన శర్మలంగదా! విప్లవాలు ఎలా తెస్తాం. కనీసం ఆఫీసులో నన్నా విప్లవకర మార్పులు తెద్దాం. అందుకు నాందిగా ఈగదిలో టేబుళ్ళు ఆ గదిలోకి, ఆ గదిలో కుర్చీలు ఈ గదిలోకి మార్చేద్దాం. కనీసం మన కుర్చీల్లోనన్నా విప్లవాలు తెద్దాం' అని కుర్చీలు, బల్లలు సర్దబోయేరుట.

నాలుగో గ్రూపు వాళ్ళు కాస్త డొక్క శుద్ధి ఉన్న బాపతు! వాళ్ళు అంతావిని, తర్వాత ఆ పెయింటింగు వెనకాల లేబిల్ని చూసేరుట! దానిమీద ఆ పెయింటింగ్ పేరు ఉంటుంది గదా! ఏదన్నా క్లూ దొరుకుతుందేమోనని! తీరా చూస్తే పేరుకుబదులు ఓ అయిదంకెల సంఖ్య వ్రాసి ఉందట.

అప్పుడు వాళ్ళు 19836 అంటే ఏమిటి? అని దీర్ఘంగా ఆలోచించేరుట. చర్చించేరుట, చివరికి వాళ్ళు ఈ పెయింటిం

గులో ఉన్నదేమంటే 19836 లో భారతదేశం అని నిర్ధారించి పారేశారుట. కాస్త డొక్క శుద్ధి వున్నవాళ్ళు గనుక 'మా తీర్మానంతో విభేదించే వాళ్ళ డొక్కలు చించి కాన్వాసులు చేయించి ఈ ఏడాది ఎకాడమీ ఆర్ట్ ఎగ్జిబిషన్లో గోల్డుమెడల్ తెచ్చుకునే కళాకారుడికి బహూకరిస్తాం! జాగ్రత్త!, అని ఓ వార్నింగుకూడా ఇచ్చి మిగతావాళ్ళ నోళ్ళు మూయించ బోయారుట.

కానీ మిగతా గ్రూపులవాళ్ళు ఊరుకోలేదు మాటా మాటా పెరిగి ఛాలెంజీలు ఎక్కువయి ఆఫీసు పనికాస్తా ఆగి పోయిందిట. బుర్రలు పగిలే ప్రమాదంకూడా ఏర్పడిందిట

ఈ సంగతి తెలిసిన ప్రొప్రయిటర్‌గారు సదరు కళా ఖండాన్ని అర్జంటుగా అక్కడ్నించి ఊడబీకించి,స్టోర్ రూంలో ఓ చీకటి మూలన పాతర వేయించి 'ఖబర్దార్! మీరిక మీదట కళను గురించి చర్చలు చేశారో, జీతాలు తెగకోస్తాను జాగ్రత్త' అని వాళ్ల నోళ్ళు మూయించబోయాట్ట.

కానీ, ఉద్యోగులకూ, వారి గ్రూపులకూ కళ ఎప్పుడో నసాళాని కంటి ఉండటాన వారు రహస్యంగా సవాళ్ళు చేసు కుని, పందేలు వేసుకుని మేనేజరు గారిని మధ్యవర్తిగా పెట్టు కుని ఆ కళాఖండం అంతు తేల్చుకోబూనుకున్నారట.

ఓ ఆదివారంనాడు సదరు కళాఖండం వేసిన అకాడమీ గోల్డుమెడల్ విన్నర్ ఆర్టిస్టుగారిని టాక్సీఎక్కించి ఆఫీసుకు తీసు కొచ్చి 'అయ్యా ఇదీ సంగతి! మీ కళాఖండంలో ఉన్న మహా

త్తర సందేశం ఏమిటో వివరించి మా తగాదాల్ని పరిష్కరించండి" అని వేడుకున్నార్ట.

అందుకా కళాకారుడు ముందు ఓ నిమిషం గడ్డం నిమురుకున్నాట్ట. తర్వాతో నిముషం జుట్టు పీక్కున్నాట్ట!

'మీరు నా కళాఖండం టైటిల్ చూళ్లేదా?' అని అకస్మాత్తుగా ప్రశ్నించేట్ట.

'చూశాం! కానీ, ఆ నెంబరు ఏంటో అర్థం గావటం లేదు సార్!' అన్నారట అందరూ ఏకగ్రీవంగా!

అప్పుడా కళాకారుడు లేచి నాలుగయిదు పచార్లు చేసి, పై కప్పుకేసి దీర్ఘంగా ఆలోచించి, నేలకేసి చూసి గాఢంగా నిట్టూర్చి 'నేటి మన కళకు కళాకారులే అర్థం చెప్పుకోవలసి రావటం ఘోరం. నా పెయింటింగులో ఉన్న దేమిటంటే మా యింటి కెదురుగా ఉన్న మున్సిపాల్టీ డస్ట్ బిన్! ఆ అంకెలు దాని మీదున్న మునిసిపాల్టీ నెంబరు" అన్నాడుట.

మా విలేఖర మిత్రుడు అడ్డం వచ్చేడు. 'మరయితే సదరు వేతన శర్మలంతా కలిసి ఆ కళాకారునికి ఏమీ సన్మానం చేయ లేదా?'

'చేద్దా మనుకున్నారుట! ఆ మహానుభావుడిని ఆయన చిత్రం ప్రక్కనే వ్రేలాడ దీద్దామనుకున్నారట కానీఎంతైనా వేతన శర్మలు గదా! అంత సాహసం చేయలేక ఊరుకున్నారుట.'

'మొత్తంమీద కళ చాలా నిగూఢమైనదేనండీ!' అన్నాడా విలేఖర మిత్రుడు ఇంకో టీకి ఆర్డరిస్తూ.

(నవంబర్ 1974)